
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.7 ၊ కనిష్ఠం 24.5

నిజామాబాద్
జిల్లా వార్తలు
ఆదివారం 30 జూన్ 2024



డీఎస్ ఇక లేరు



అనారోగ్యంతో హైదరాబాద్‌లో కన్నుమూత

- పలువురు ప్రముఖుల నివాళులు
- నిజామాబాద్‌కు చేరుకున్న డీఎస్ పార్థివదేహం
- నేడు నగరంలోని బైపాస్ రోడ్‌లో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
- నేడు సీఎం రాక

నిజామాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ సీనియర్ నేత, పీసీసీ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ ఇకలేరు. అనారోగ్యంతో ఆయన హైదరాబాద్‌లో శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో కన్నుమూశారు. సుదీర్ఘకాలం కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా వ్యవహరించిన ఆయన పలు పదవులను అధిష్ఠించారు. ఎమ్మెల్యే, పీసీసీ అధ్యక్షునిగా, రాష్ట్ర మంత్రిగా డీఎస్ పనిచేశారు. రెండు దఫాలు కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో ఆయన క్రియాశీలకంగా వ్యవహరించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అభివృద్ధితో పాటు ఇతర కార్యక్రమాల్లో తనదైన ముద్ర వేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎంతో క్రియాశీలకంగా వ్యవహరించిన డీఎస్ ప్రత్యేక తెలంగాణ ఏర్పాటులోనే కీలకమైన పాత్రను పోషించారు.

వేల్పూర్‌లో డీఎస్ జననం

జిల్లాలోని వేల్పూర్‌లో 1948 సెప్టెంబరు 27న డీఎస్ జన్మించారు. నిజామాబాద్‌తో పాటు హైదరాబాద్‌లోని నిజాం కాలేజీలో డిగ్రీ పూర్తిచేశారు. కొంత కాలం పాటు డీఎస్ రిజర్వ్ బ్యాంకులో పనిచేశారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరి రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత మాజీ మంత్రి అర్గుల్ రాజారాం శిష్యుడిగా రాజకీయ రంగప్రవేశం చేసిన డీఎస్.. కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా పనిచేశారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి మూడు దఫాలు ఎమ్మెల్యేగా ఎంపికయ్యారు. రాజకీయ జీవితాన్ని ఆయన 1981లో ప్రారంభించారు. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీగా పోటీచేసి ఓడిపోయారు. ఆయన 1983లో నిజామాబాద్ అసెంబ్లీకి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఓటమిపాలయ్యారు. మొదట ఆయన రాజకీయంగా ఓటమి చెందినా.. ఆ తర్వాత మూడు దఫాలు గెలిచి కీలకమైన మంత్రి పదవుల్లోనూ పనిచేశారు. మొదటి సారిగా ఆయన 1989లో ఎమ్మెల్యేగా ఎన్నికై అసెంబ్లీలో అడుగు పెట్టారు. మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి మంత్రి వర్గంలో ఆయన పనిచేశారు. ఆ తర్వాత నిజామాబాద్ నుంచి 1999, 2004లో మళ్లీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వైఎస్ సీఎంగా ఉన్న సమయంలో రాష్ట్ర మంత్రిగా ఆయన పనిచేశారు. ఉన్నత విద్యాశాఖతో పాటు ఇతర శాఖల మంత్రిగా కొనసాగారు. ఆ తర్వాత ఆయన నిజామాబాద్‌ను వదిలి నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో 2009, 2012, 2014లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. వైఎస్ రెండో దఫా అధికారంలోకి రావడంలో ఆయన క్రియాశీలకంగా పనిచేశారు. ఎమ్మెల్యేగా ఓడిపోయిన ఎమ్మెల్సీగా 2011లో ఎంపికై 2014 వరకు కొనసాగారు. రెండవ దఫా ఎమ్మెల్సీ అవకాశం రాకపోవడం తగినవిధంగా గుర్తింపు ఇవ్వకపోవడం వల్ల జూలై 2, 2015లో ఆయన టీఆర్ఎస్‌లో చేరారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా పనిచేశారు. ఆ పార్టీ తరఫున 2016 నుంచి 2022 వరకు రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా గత సంవత్సరం ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. వైఎస్ హయాంలో రెండు దఫాలు పీసీసీ అధ్యక్షునిగా పనిచేశారు. 2004 నుంచి 2011 వరకు ఆయన రెండు దఫాలు పీసీసీ అధ్యక్షునిగా కొనసాగారు.

నిజామాబాద్ అభివృద్ధిలో కీలక పాత్ర

నిజామాబాద్ అభివృద్ధిలో డీఎస్ పాత్ర మరువలేనిది. నిజామాబాద్ ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలోనే కార్పొరేషన్ ఏర్పాట్లలో కీలకపాత్ర వహించారు. నగర కార్పొరేషన్ అభివృద్ధికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీతో పాటు ఇతర పనులను తీసుకువచ్చారు. జిల్లాలో తెలంగాణ విశ్వవిద్యాలయం ఏర్పాటులో కీలకపాత్ర వహించారు. ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న సమయంలో విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. నిజామాబాద్‌లో రాజారాం స్టేడియం, ఇతర పనుల్లో కీలకంగా పనిచేశారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షునిగా ఉన్న సమయంలో అనుచరులకు పదవులు ఇప్పించడంలోనూ అదేరీతిలో వ్యవహరించారు. నగర పరిధిలో పేదలకు ఇండ్ల స్థలాల పంపిణీలో కీలకంగా వ్యవహరించడంతో పాటు వేలాది మందికి పట్టాలను ఇచ్చారు. నగరం పరిధిలో ఆయన పేరు మీద ధర్మపురి హిల్స్‌కాలనీ ఏర్పాటు అయ్యింది.

నేడు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీ, రాష్ట్ర మంత్రిగా, రాజ్యసభ సభ్యునిగా పనిచేసిన డీఎస్ అంత్యక్రియలను అధికార లాంచనాలతో నిర్వహించనున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నగర శివారులోని బైపాస్ రోడ్‌లో ఆయన వ్యవసాయ భూమిలోనే ఆదివారం అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు శనివారం సాయంత్రం ఏర్పాట్లను పరిశీలించారు. కార్యకర్తలతో పాటు ఎమ్మెల్యేలు, మంత్రులు హాజరు కానుండటంతో ఈ ఏర్పాట్లను కొనసాగిస్తున్నారు. అంత్యక్రియల ఏర్పాట్లలో నగర కార్పొరేషన్ కమిషనర్ మకరంద్‌తో పాటు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. పోలీసుల ఆధ్వర్యంలో వ్యవసాయ భూమి వద్ద బందోబస్తును ఏర్పాటు చేశారు.

పలువురి సంతాపం..

డీఎస్ మృతి పట్ల జిల్లాకు చెందిన పలువురు నేతలు సంతాపం తెలిపారు. జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు డీఎస్‌తో తనకున్న అనుబంధం మరువలేనిదని తెలిపారు. తనకు మంచి స్నేహితుడని ఇద్దరం కలిసి పార్టీలో ఉండటంతో పాటు ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి చేశామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గణేష్‌గుప్త, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి హైదరాబాద్‌లో డీఎస్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.


• శోకసంద్రంలో డీఎస్ కుటుంబ సభ్యులు




• నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు


• నివాళులర్పిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్




• అంత్యక్రియల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్




• రోదిస్తున్న మహిళలు

నగరానికి చేరిన డీఎస్ పార్థివదేహం

- నివాళులర్పించిన కలెక్టర్, ఇతర అధికారులు

నిజామాబాద్ అర్బన్, జూన్ 29: పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు డి.శ్రీనివాస్ శనివారం ఉదయం హైదరాబాద్‌లో మృతి చెందగా ఆయన పార్థివదేహాన్ని సాయంత్రం నగరంలోని ప్రగతినగర్‌లోగల ఆయన నివాసానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు 'శీనన్న అమర్ హై' అంటూ నివాళులర్పించారు. డీఎస్ పార్థివదేహానికి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్లు కిరణ్‌కుమార్, అంకిత్, ఇతర అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నగర అధ్యక్షుడు కేశవేణు, నాయకులు గడుగు గంగాధర్, నగేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, బీజేపీ నాయకులు బస్వలక్ష్మీనర్సయ్య, దినేష్, తదితరులు ఆయన పార్థివదేహానికి నివాళులర్పించారు. పలువురు మహిళా నాయకురాళ్లు శీనన్న పార్థివదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు.

నేడు సీఎం రేవంత్‌రెడ్డి రాక

డీఎస్ అంత్యక్రియల్లో పాల్గొననున్న ముఖ్యమంత్రి

నిజామాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం జిల్లాకు రానున్నారు. డీఎస్ అంత్యక్రియల్లో ఆయన పాల్గొననున్నారు. హెలికాప్టర్ ద్వారా నిజామాబాద్‌కు రానున్న సీఎం నేరుగా ప్రగతినగర్‌లోని ఆయన ఇంటికి వెళ్లి పార్థివ దేహానికి నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. ప్రభుత్వం తరఫున లాంచనాలతో ఈ అంత్యక్రియలు జరుపుతుండటంతో సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారు. అయనతో పాటు మంత్రులు కూడా రానున్నట్లు సమాచారం. సీఎం జిల్లా కేంద్రానికి రానుండటంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్న మయ్యారు. పోలీసులు ప్రగతినగర్ వద్ద భారీ బందో బస్తును ఏర్పాటు చేస్తున్నారు. బారికెడ్‌లను ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్‌ను డైవర్ట్ చేస్తున్నారు. సీఎం ఉదయం 11గం టలలోపు రానున్నట్లు అధికారులు తెలిపారు. నగర శివారులోని బైపాస్ రోడ్‌లోని డీఎస్ వ్యవసాయ భూమిలో ఈ అంత్యక్రియలను నిర్వహించనున్నారు. అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాట్లను కొనసాగిస్తున్నారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే జైలుకే

- జిల్లా న్యాయాధికారి సునీత
- విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి: సీపీ

డిచ్‌పల్లి, జూన్ 29: లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే జైలుపాలవుతారని, 18 ఏళ్లు నిండిన తర్వాతే వాహనచోదకులకు లైసెన్స్‌లు ఇవ్వబడతాయని జిల్లా న్యాయాధికారి సునీత అన్నారు. శనివారం ఖిల్లా డిచ్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1989-90 సంవత్సరం బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయాధికారి సునీత మాట్లాడుతూ.. చిన్న వయస్సులో బైకులు నడపడం వల్ల ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారని, నూతన లైసెన్స్ చట్ట ప్రకారం లైసెన్స్ లేకుండా నడిపిన వారికి జైలు శిక్ష తప్పదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయంలో ఆలోచించాలని సూచించారు. పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. పదోతరగతి, ఇంటర్ విద్యార్థులు ఆన్‌లైన్ ఫోన్‌ల వాడకం మానుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమాజంలో విద్యా ద్వారనే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. 1989లో పూర్వ విద్యార్థిగా ఉన్న శ్రీనివాస్ పట్టుదలతో సర్కిల్ ఇన్స్‌పెక్టర్ అయ్యారని, ప్రతి విద్యార్థి అంకిత భావంతో విద్యను అభ్యసించాలని తెలిపారు. అలాగే పూర్వ విద్యార్థులు అందజేసిన 250 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలను జిల్లా న్యాయాధికారి సునీత, పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ విద్యార్థులకు అందజేశారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, వాటర్ ఫిల్టర్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సీతయ్య, సుద్దపల్లి హెచ్‌ఎం నరేశ్, ఘన్‌పూర్ హెచ్‌ఎం ఆనంద్ పాల్గొన్నారు.


విద్యార్థులకు డిక్షనరీలను అందజేస్తున్న జిల్లా న్యాయాధికారి, పోలీసు కమిషనర్

రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా?


పిప్రి, మగ్గిడి గ్రామాల మధ్య రోడ్డు దుస్థితి ఇలా..

- గుంతల మయంగా రోడ్డు
- వాహనాల రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



ఆర్మూర్‌రూరల్, జూన్ 29: ఆర్మూర్ మండలం పిప్రి గ్రామం నుంచి మగ్గిడి, ఖానాపూర్, అమ్దాపూర్ గ్రామాలకు వెళ్లే రోడ్డు గుంతలు పడి ఇబ్బందిగా మారింది. ఈ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.కోటి 70లక్షలు మంజూరు చేసింది. పనులను ప్రారంభించి ఎన్నికల కోడ్ కారణంగా నిలిపివేశారు. ఇటీవల కురుస్తున్న మోస్తరు వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి వాహనదారులకు ప్రయాణం ఇబ్బంది కరంగా మారింది. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ఈ రోడ్డు వెంబడి ప్రయాణం చేయాలంటే ప్రజలు జంకుతున్నారు. ఇటీవల రోడ్డుపై గుంతల కారణంగా మగ్గిడి నుంచి ఆర్మూర్ వెళ్తున్న ప్రయాణికుల ఆటో బోల్తా పడడంతో ఒకరికి కాలు విరగగా.. మరికొందరికి తీవ్రగాయాలయ్యాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు ప్రమాదాలకు గురై ఆసుపత్రిలో చేరిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిసినప్పటికీ సంబంధిత అధికారులు పనులు చేపట్టి పూర్తి చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

నిత్యం రద్దీగా ఉండే రోడ్డు..

ఈ రోడ్డు వచ్చిపోయే వాహనాలు, ప్రయాణం చేసే వారితో నిత్యం రద్దీగా ఉంటుంది. మండలంలోని మగ్గిడి, ఖానాపూర్, అమ్దాపూర్ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలన్న విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలన్నా.. ఈ రోడ్డు మీదుగా వెళ్తుంటారు. అంతే గాకుండా గోదావరి పరివాహక ప్రాంతం వద్దకు పుణ్య స్నానాలకు, ఇతర శుభకార్యాలయాలకు వెళ్లే భక్తులకు సైతం రోడ్డు రద్దీగా ఉంటుంది. గుంతలు పడిన రోడ్డుతో ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. ఈ రోడ్డుకు పదేళ్ళ క్రితం బీటీరోడ్డు వేశారు. అనంతరం రోడ్డుపై గుంతలు పడినప్పటికీ అధికారులు, నాయకులు పట్టించుకున్న దాఖలాలు లేవు. గత సంవత్సరం అప్పటి ప్రభుత్వం రోడ్డు మరమ్మత్తులకు పిప్రి నుంచి ఖానాపూర్ వరకు రూ.కోటి 70లక్షలు మంజూరు చేసింది. ఇళ్లు మంజూరైనప్పటికీ ఇప్పటికీ పనులు చేపట్టకపోవడం బాధాకరం. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు బాగుచేయాలని కోరుతున్నారు.

సబ్‌స్టేషన్ ముట్టడించిన యువకులు

సిరికొండ జూన్ 29 :మండల కేంద్రమైన సిరికొండలో ప్రతి రోజు విద్యుత్ సరాఫరాలో అంతరాయం కలుగుతుందని సిరికొండ యువకులు శనివారం విద్యుత్ కేంద్రాన్ని ముట్టడించారు. పగలు,రాత్రి అనే తేడా లేకుండా విద్యుత్ సరాఫరాలో తీవ్రమైన అంతరాయం కలుగుతున్నదున గ్రామానికి చెందిన యువకులు వీడీసీ ఆధ్వర్యంలో సబ్‌స్టేషన్‌కు తరలివెళ్లి ఏఈని నిలదీసినంత పని చేశారు. గ్రామంలో ఎందుకంత విద్యుత్ సమస్య తలెత్తుతుందని ఏఈ చంద్రశేఖర్‌ను ప్రశ్నించారు. మండలంలోని ఏ గ్రామంలో కూడా ఇన్ని దఫాలుగా విద్యుత్ నిలిచిపోవడానికి గల కారణమేమిటని యువకులు ఏఈ నిలదీశారు. మా గ్రామంలో విద్యుత్ సమస్య ఉత్పన్నం కావడానికి ప్రధాన కారణం హుస్సేన్‌నగర్‌కు నేరుగా, చిన్నవాల్గోట్‌కు సప్లయ్ చేసే ఫీడర్ల వల్లేనని యువకులు ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. ఏఈ మాట్లాడుతూ విద్యుత్ సరాఫరాలో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటానని అన్నారు. చిన్నవాల్గోట్ ఫీడర్ వల్ల ఎలాంటి సమస్యలే లేవని ఆయన యువకులు సమధానం ఇచ్చారు. హుస్సేన్‌నగర్ ఫీడర్ సమస్య పరిష్కారం తనతో కాదని అది ఉన్నతాధికారుల చేతులో ఉందని ఏఈ చంద్రశేఖర్ వారితో చెప్పారు.

గుంతలు పూడ్చిన పూర్వవిద్యార్థులు

కమ్మర్‌పల్లి, జూన్ 29: కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన యువకులు, పూర్వ విద్యార్థులు బుధవారం జాతీయరహదారిపై ప్రమాద భరితంగా మారిన గుంతలను సిమెంట్ మిక్సింగ్‌తో పూడ్చివేత కార్యక్రమాన్ని చేపడుతు తమవంతు సేవ దృక్పథాన్ని చాటుకుంటున్నారు. కమ్మర్‌పల్లి మోర్తాడ్ మండలాల సరిహద్దు నుండి జిల్లా సరిహద్దు గండిహనుమాన్ వరకు జాతీయరహదారిపై అడుగులోతే గుంతలు ఏర్పడ్డాయి. గుంతలు రహదారి గుండా వెల్లే వాహనదారులకు ప్రాణసంకటంగా మారాయి. కాగా మంగళవారం కమ్మర్‌పల్లి నుండి మెట్‌పల్లి వైపు తన కొడుకుతో స్కూటిపై వెలుతున్న డిష్ నరేందర్ అనే వ్యక్తి ఎదరుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి స్కూటీ టైరు గుంతలో పడగా ఇద్దరు ఎగిరిపడి తీవ్రగాయాలపాలై ప్రస్తుతం హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో స్పందించిన కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన 1996-97 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు జాతీయరహదారిపై ఏర్పడిన ప్రమాదభరితంగా మారిన గంతలను పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. గుంతల్లో సిమెంట్ కంకరతో పూడ్చి ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపడుతున్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుని మృతి

బోధన్ రూరల్, జూన్ 29: బోధన్ పట్టంలోని రాకాసిపేట్‌లో ఓ ఇంటి నిర్మాణం చేస్తుండగా కూలీ పనికి వెళ్లిన పవన్ (24) అనే యువకుడు మృతిచెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి సిఐ వీరయ్య తెలిపిన వివరాల ప్రకారం ఇంటి ఇర్మాణం పనులలో భాగంగా కూలీ పనికి వచ్చి ఇంటి స్లాబ్‌పైకి ఎక్కి ఇనుప రాడు తీస్తుండగా పైన ఉన్న విద్యుత్ తీగలకు రాడు తగలడంతో పవన్ విద్యుత్ షాక్‌కు గురయ్యాడని, స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరిస్తుండగా మృతిచెందాడని తెలిపారు. మృతుడు బెల్లాల్ గ్రామానికి చెందిన వాడు. మృతుని తల్లి అబ్బవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

'చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి'

ఎడపల్లి, జూన్ 29: చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని బోధన్ జేఎఫ్‌సీఎం న్యాయాధికారి సాయిశివ అన్నారు. మండల కేంద్రంలోని ఎడపల్లి గ్రామ శివారులో ఉన్న తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో శనివారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒకచోట అవమానాలపాలు అయి ఉంటారని అలాంటప్పుడే వాటిని ఎదుర్కొని జీవితంలో స్థిరంగా నిలబడాలని ఆయన సూచించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధులు, ఫోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆడపిల్లలకు ఏమైనా సమస్యలు వచ్చినపుడు తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు తెలిపి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ నరేష్, ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ సుహాసిని రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సునీల్ కుమార్

ఏర్గట్ల, జూన్ 29: మండలంలోని తాళ్ళరాంపూర్ గ్రామానికి చెందిన బోదాసు గంగాధర్ ఇటీవలే తాటిచెట్టు నుంచి పడి మృతి చెందగా శనివారం బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి పది వేలు ఆర్థిక సహాయంగా అందజేసి బాధిత కుటుంబానికి అన్ని విధాల ఆదుకుంటామని భరోస ఇచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, ఆడెపు గంగాప్రసాద్, పెద్దిరెడ్డి రవి, బెజ్జారపు భాను, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పనులు పరిశీలించిన కమిషనర్

ఆర్మూర్‌టౌన్, జూన్29 : మున్సిపల్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. శనివారం ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద డ్రైనేజీ పనులతో పాటు 19 వార్డులో పలు కట్టడాలతో పాటు సోషల్ వెల్ఫేర్ మహిళ స్కూల్‌లోని వంట గదిని, ఆల్‌ఫోర్స్ కళాశాలలోని మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. ఆయనతో పాటు సానిటరీ ఇన్స్‌పెక్టార్ మహేష్, టౌన్‌ప్లానింగ్ అధికారి హరిష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థులకు సన్మానం

పెర్కిట్, జూన్29: జెఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ర్యాంకు సాధించిన క్షత్రీయ జూనియర్ కళాశాల విద్యార్థినిలు వై.నవ్య, ఎం.పూజితలను కళాశాల యాజమాన్యం శాలువ, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. నవ్య ఎన్ఐటీలో ఆంధ్రప్రదేశ్, పూజిత ఎన్ఐటీ పాట్నలో సీటు సంపాదించారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, అధ్యాపక బృందం పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

యువతి ఆత్మహత్య

మోస్రా, జూన్ 29: మండలంలోని ఓ గ్రామంలో నిజామాబాద్‌లో ఫ్యాషన్ డిజైన్ చదివే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. యువతిని మరొక గ్రామానికి చెందిన యువకుడు వేధించడంతో మనస్థాపం చెందిన యువతి శుక్రవారం రాత్రి తన ఇంట్లో ఉరి వేసుకుని చనిపోయినట్లు తెలిపారు.యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఉమ్మడి వర్ని మండల ఎస్ఐ కృష్ణ కుమార్ తెలిపారు.

డీఎస్ మృతదేహాన్ని సందర్శించిన కాంగ్రెస్ నాయకులు

ఇందల్వాయి, జూన్ 29:ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ పిసిసి అధ్యక్షుడు, మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యుడు డి.శ్రీనివాస్ మృతదేహాన్ని శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో రూరల్ కాంగ్రెస్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు డి.శ్రీనివాస్ మృతిపట్ల విచారం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలియజేశారు. డి.శ్రీనివాస్ కాంగ్రెస్‌లో ఎన్నో ఉన్నత పదవులను అధిరోహించారని నిజామాబాద్ జిల్లాకు పేరు ప్రతిష్ఠలు తీసుకువచ్చారని అన్నారు. అలాంటి మహానాయకుడు మృతిచెందడం పార్టీకి తీరనిలోటని అన్నారు. ఆయన మృతదేహాన్ని సందర్శించిన వారిలో డిసిసి ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, కిసాన్ కేత్ నాయకుడు ముప్పగంగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, లారి గంగారెడ్డి, తదితరులు ఉన్నారు.

హైదరాబాద్‌కు తరలిన నాయకులు

మోపాల్, జూన్ 29:మాజీ పీసీసీ అధ్యక్ష, మాజీ రాజ్యసభ సభ్యుడు డి.శ్రీనివాస్ మరణించిన సమాచారం అందడంతో మోపాల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఆయన మృతదేహాన్ని చూసి పార్టీ నాయకులు కన్నీరు మున్నీరు అయ్యారు. గత కొన్ని సంవత్సరాల నుంచి రూరల్ నియోజకవర్గంలో, జిల్లాలో రాజకీయంగా ఒక వెలుగు వెలిగిన డి.శ్రీనివాస్ మృతిని ఆ పార్టీ నాయకులు జీర్ణించుకోలేకపోయారు. తమకు పెద్ద దిక్కుగా ఉన్న శ్రీనివాస్ మరణాన్ని నమ్మలేకపోతున్నారని అన్నారు. హైదరాబాద్‌కు తరలిన వారిలో కాంగ్రెస్ కిసాన్‌కేత్ జిల్లా అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి, భాస్కర్‌రెడ్డితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

'మంచి నాయకుడిని కోల్పోయాం'

ఆర్మూర్‌టౌన్ , జూన్29: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో ఉన్నత పదవులు పొంది అందరికి ఆదర్శంగా నిలిచిన మంచి నాయకుడు డి.శ్రీనివాస్‌ను కోల్పోవడం బాధకరమని మాజీజడ్పీటీసీ గంట సదానందం అన్నారు. దళిత, బడుగు బలహీనవర్గాలకు ఆయన లేకపోవడం తీరని లోటని ఆయనను ఆదర్శవంతంగా తీసుకొని రాజకీయ నాయకులుగా ఎదిగిన వారు రాష్ట్రంలో చాలా మంది ఉన్నారన్నారు. డీఎస్ కుటుంబసభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

డీఎస్‌కు నివాళులు అర్పించిన వేల్పూర్ వాసులు

వేల్పూర్, జూన్29: మాజీ డీసీసీ అధ్యక్షుడు డీ.శ్రీనివాస్ మృతి పట్ల ఆయన స్వగ్రామమైన వేల్పూర్‌లో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం వేర్వేరుగా ఘనంగా నివాళులు అర్పించారు. అంతకు ముందు డీఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తూ ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని 20నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 22 కోళ్లు మృతి

ఆర్మూర్‌టౌన్, జూన్29: మున్సిపల్ పరిధిలోని యోగేశ్వరకాలనీలో వీధికుక్కల దాడిలో 22కోళ్లు మృతిచెందాయని బాధితుడు పల్లె బోయిదాస్ తెలిపారు. ప్రతీరోజు మాదిరిగానే ఇంటి ఆవరణలో జాలిలో కోళ్లను మూసి ఉంచగా శనివారం ఉదయం లేచి చూసేసరికి కుక్కలు కోళ్ళపై దాడి చేసి చంపినట్టు ఆయన తెలిపారు. దీంతో సుమారు రూ.12వేల నష్టం వాటిల్లిందని అన్నారు. కుక్కల నివారణకై మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

‘కౌలు రైతుకు రైతుబంధు ఇవ్వాలి’

మోపాల్, జూన్ 29 : కౌలు రైతులకు ప్రభుత్వం రైతుబంధు ఇచ్చే విధంగా అధికారులు చొరవ చూపాలని రైతులు డీసీవోను కోరారు. శనివారం బోర్గాం(పీ) సొసైటీ అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక మహాజన సభను నిర్వహించారు. సభకు ముఖ్యఅతిథిగా డీసీవో శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. సమావేశంలో రైతులు మాట్లాడుతూ 10 ఎకరాలు ఉన్న రైతుకు కూడా రైతుబంధు వచ్చే విధంగా చూడాలన్నారు. రైతులకు అవసరమైన వ్యవసాయ సామగ్రితో పాటు ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై ఇచ్చే విధంగా చూడాలన్నారు. డీసీవో మాట్లాడుతూ సొసైటీల అభివృద్ధి కోసం రైతులు కృషి చేయాలన్నారు. డీసీవో, ఏవో హీరాను సొసైటీ పాలకవర్గం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు జయకృష్ణ, సొసైటీ డైరెక్టర్లు, సభ్యులు సన్మానించారు.

వివాదాలు లేకుండా పదవీ విరమణ గొప్ప విషయం

ఖిల్లా, జూన్ 29:పోలీసుశాఖలో పనిచేస్తూ ఎలాంటి రిమార్క్ లేకుండా పదవీ విరమణ చేయడం గొప్ప విషయమని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ అన్నారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేసిన వారికి శనివారం సన్మానం, వీడ్కోలు కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో విధులు నిర్వహించడం ఉన్నతమైనదని, ఎంతో పనిఒత్తిడితో విధులు నిర్వహించి ప్రజలకు రక్షణగా ఉంటారని తెలిపారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పక ఉంటుందని మీరు ఏ శాఖలో పనిచేసినా ఆ శాఖకు చేసిన సేవలు ఎంతో ఘనసీయమైనవని వారిని అభినం దించారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహించి పదవి విరమణ చేసిన వారి కుటుంబసభ్యులకు పోలీస్‌శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. పదవీ విరమణ చేసిన వారిలో జి.ఎల్లయ్య ఎస్సై సిటిసి, ఎ.రాములు ఎస్సై రూరల్ పోలీస్ స్టేషన్, ఎస్.రాంసింగ్ హెడ్‌కానిస్టేబుల్ పోలీస్ కంట్రోల్ రూమ్, ఎ.జనార్ధన్‌రావు హెడ్ కానిస్టేబుల్ మహిళాపోలీస్ స్టేషన్, అదనపు డీసీపీ బి.కోటేశ్వర్‌రావు, సీసీఆర్‌బీ ఏసీబీ రవీందర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, సూపరింటెండెంట్లు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధ్యాయుల పదోన్నతుల్లో అక్రమాలు’

నిజామాబాద్ అర్బన్, జూన్ 29:జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతుల్లో అక్రమాలు జరిగాయని డీటీఎఫ్ నేతలు శంతన్, ఓమాజి, బాలయ్యలు ఒక ప్రకటనలో ఆరోపించారు. ఉపాధ్యాయుల పదో న్నతులు రాష్ట్రస్థాయిలో నిర్ణయానికి అనుగుణంగా చేయాల్సి ఉన్నా డీఈవో ఇష్టారాజ్యంగా చేశారని వారు ఆరోపించారు. సీనియారిటీ జాబితాలో డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌కు అనుగుణంగా పదోన్నతులు ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోలేదని వారు విమర్శించారు. గైర్హాజరు ఉన్న పాఠశాలల్లో వేకెన్సీ చూపెట్టి భర్తీలు చేపట్టారని ఆరోపించారు.

మున్సిపల్ కార్మికుల పీఆర్సీ బకాయిలు చెల్లించాలి

బోధన్‌రూరల్,జూన్29: మున్సిపల్ కార్మికులకు పీఆర్సీ బకాయిలు, మేడే కానుకలను, పారిశుధ్య కార్మికులకు పని ముట్లను వెంటనే అందజేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు మల్లేష్ డిమాండ్ చేశారు. శనివారం బోధన్ మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించి కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థల్లో అన్ని విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు పెరిగిన పీఆర్సీ జీతాలను చెల్లిస్తూ ఏరియర్స్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. బోధన్ మున్సిపాలిటిలో పనిచేస్తున్న కార్మికులకు ఇప్పటి వరకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు రావాల్సిన పీఆర్సీ బకాయి వేతనాలు, మేడే కానుకలను, కార్మికుల పని ముట్లను వెంటనే అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు ఈర్షద్, మోహన్, మున్సిపల్ కార్మిక నాయకులు గంగామణి, పోశెట్టి, అబ్బయ్య, భూమయ్య, సాయిలు, రాజు, పోశవ్వ, సాయవ్వ, లక్ష్మి, రాజు, శంకర్, గంగారాంలతో కార్మికులు తదితరులున్నారు.

నిజామాబాద్ సొసైటీలో ఖాళీలు నింపండి

నిజామాబాద్ రూరల్, జూన్ 29: రైతులకు అందిస్తున్న రైతుబంధుపై నిజామాబాద్ సొసైటీలో రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. శనివారం జాయింట్ రిజిస్ట్రార్ బి.వసంత, సొసైటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, సొసైటీ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. రైతుబంధు పథకం అమలుపై రైతుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. సీజన్ ప్రారంభంలోనే రైతుకు సహాయం అందితేనే ఉపయోగంగా ఉంటుందని రైతులు తెలిపారు. పాస్‌బుక్ యూనిట్‌గా తీసుకుని 5 నుంచి 10 ఎకరాల వరకు రైతుబందు సహాయం ప్రభుత్వం ఇవ్వాలని రైతులు కోరారు. సొసైటీ చైర్మన్ రవీందర్ మాట్లాడుతూ.. సొసైటీలో ఇప్పటివరకు ఎలాంటి నగదు (బ్యాలెన్స్ సొమ్ము) లేవన్నారు. బ్యాలెన్స్ సొమ్ము లేకున్నా రైతులకు కావలసిన ఎరువులు, విత్తనాలు సిద్దంగా ఉంచామన్నారు. నిజామాబాద్ సొసైటీకి కార్యదర్శి లేరని వెంటనే పర్మినెంట్ కార్యదర్శిని నియమించాలని కోరారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన వంశీ మాక్లూర్‌సొసైటీకి బదిలీపై వెళ్లారు. దాంతో సొసైటీలో రెండు నెలలుగా కార్యదర్శి పోస్టు ఖాళీగా ఉంది. సొసైటీ డైరెక్టర్లు యెండల సంతోష్, నీలిమ పాల్గొన్నారు.



రైతుబంధుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్

బోధన్‌రూరల్,జూన్29: వర్షాకాలం సీజన్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్, ఆచన్‌పల్లి, తదితర వార్డుల్లో ఆయన పర్యటించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలల్లోని పాత టైర్లు, కూలర్‌లలో అపరిశుభ్రత నీటి నిల్వలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. లేని యెడల దోమలు పెరిగి వ్యాధులు వ్యాప్తించే అవకాశం ఉందన్నారు. దోమల వల్ల డెంగ్యూ, చికెన్ గూన్యా, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తించే అవకాశాలు ఉన్నాయన్నారు. పలు అంటువ్యాధులు వ్యాప్తించే అవకాశం ఉందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం బోధన్ మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్‌తో కలిసి పరిశుభ్రతపై చర్చించారు. అనంతరం విజయసాయి ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విద్య, విజయసాయి కృష్ణ మోహన్, ఐఆర్ చక్రవర్తి, మున్సిపల్ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎం అండ్ హెచ్‌వో తుకారం

నర్సింగ్ వృత్తిలో ఎన్నో సేవలు, విజయాలను అందించారు

● ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్

పెద్దబజార్, జూన్ 29:నర్సింగ్ వృత్తిలో ఎన్నో సేవలు, విజయాలను అందించారని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-3 ఎంఎస్‌విఎల్ పార్వతి పదవి విరమణ సందర్భంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతిమరాజ్ మాట్లాడుతూ క్లిష్టమైన కరోనా సమయంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆమె నర్సింగ్ సూపరింటెండెంట్ సారథ్యంలో నర్సింగ్ సిబ్బంది కరోనాకు భయపడకుండా ప్రోత్సాహం అందించి, సిబ్బందిచే బాధ్యతాయుతమైన విధులను నిర్వర్తింపజేసిన ఘనత పార్వతిదేనన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ బాల్‌రాజ్, ఏడీ సంతోష్‌కుమార్, ఆసుపత్రి నర్సింగ్‌హోం సూపరింటెండెంట్ పారిజాతం, చంద్రకళ పాల్గొన్నారు.



సన్మానం చేస్తున్న డాక్టర్ ప్రతిమరాజ్

‘చెరుకు ఫ్యాక్టరీ పునరుద్ధరణకు పోరాటం చేయాలి’

నిజామాబాద్ రూరల్, జూన్ 29: సారంగపూర్‌లోని సహకార చక్కెర కర్మాగారం తిరిగి తెరిపించేందుకు చెరుకు రైతులంతా ఏకతాటిపైకి రావాలని చెరుకు సంఘం నేతలు తెలిపారు. శనివారం రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో చెరుకు రైతులకు అవగాహన కల్పించారు. చెరుకు ఫ్యాక్టరీ నడిచినన్నిరోజులు రైతులకు స్వర్ణయుగంలా ఉండేదన్నారు. రైతులు, కార్మికుల జీవితాలు ఆనందంగా గడిచాయని, ఫ్యాక్టరీ మూతపడినప్పటి నుంచి చెరుకు రైతులకు కష్టాలు మొదలయ్యాయన్నారు. గత పాలకులకు ఎన్నోసార్లు వినతిపత్రాలు సైతం ఇవ్వడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెరుకు ఫ్యాక్టరీలు పునరుద్ధరిస్తారన్న నమ్మకం కుదిరిందన్నారు. బోధన్‌లోని నిజాంషుగర్ ఫ్యాక్టరీతోపాటు సారంగపూర్ సహకార చక్కెర కర్మాగారం తెరిపిస్తే వందల మంది రైతులు లాభపడతారని తెలిపారు. చెరుకు రైతులను చైతన్యపరిచే కార్యక్రమంలో భాగంగా ప్రతీ గ్రామంలో సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రైతు నాయకులు కృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాములు, అశోక్, రాజ్‌కుమార్, ఆష్మాబేగం, నాగయ్య, గంగమణి తదితరులు పాల్గొన్నారు.

టీయూలో క్రిమినల్ లా పై వర్క్‌షాప్



మాట్లాడుతున్న ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ సెషన్ న్యాయాధికారి

డిచ్‌పల్లి,జూన్ 29: తెలంగాణ విశ్వవిద్యాలయంలో శనివారం న్యాయ కళాశాలలో న్యూ క్రిమినల్ లా పై అవగహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి అధ్యక్షతగా వహించగా ప్రధాన వక్తగా జిల్లా సెషన్ న్యాయాధికారి కనకదుర్గా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మూడుచట్టాల్లో మొదటి భారతీయ న్యాయ సంహిత, రెండవది భారతీయ నాగరిక సురక్ష సంహిత, మూడోది భారతీయ సాక్ష్య సంహితపై సంపూర్ణమైన అవగహన కల్పించారు. వర్క్‌షాపులో అడ్వకేట్ హైకోర్టు ఆఫ్ తెలంగాణ శ్రవణ్‌కుమార్ పవర్ ప్రజెంటేషన్ ద్వార నూతన క్రిమినల్ లాలో ఎదురయ్యే సమస్యలను వివరించారు. కార్యక్రమంలో డా.స్రవంతి, నాగజ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

తడపాకల్ విద్యార్థికి రాష్ట్రస్థాయి సాహిత్య పురస్కారం

ఏర్గట్ల, జూన్ 29: మండలంలోని తడపాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న తొమ్మిదోతరగతి విద్యార్థిని మహమ్మద్ రిమ్‌షాకి రాష్ట్రస్థాయిలో సాహిత్య పురస్కారం లభించిందని తెలుగు పండితుడు ప్రవీణ్ శర్మ తెలిపారు. వసుంధర విజ్ఞాన మండలి వారు నిర్వహించిన పోటీల్లో పర్యావరణం గురించి కవిత రాసి రాష్ట్ర స్థాయి సాహిత్య పురస్కారం రావడంతో వారు పంపిన పురస్కారాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ జావిద్ రిమ్‌షాకు అందజేశారు.

పది ఎకరాలలోపు వారికే రైతుబంధు అమలు చేయాలి

● అధికారులకు రైతుల వినతి

డిచ్‌పల్లి, జూన్ 29: పదిఎకరాలలోపు ఉన్న రైతులకు రైతు బంధు వచ్చేలా చర్యలు తీసుకోవాలని శనివారం ఖిల్లా డిచ్‌పల్లి, బర్దిపూర్ సహకార సంఘాల్లోని రైతులు జిల్లా వ్యవసాయాధికారి వాజీద్ హుస్సెన్‌కు విన్నవించారు. ప్రతి పంట సీజన్‌లో జూన్ 10, నవంబరు 15లోపు అందజేయాలన్నారు. నాలాభూములు, సాగుకు పనికిరాని భూములకు రైతు బంధు ఇవ్వవద్దని వారు ఈ సందర్భంగా తీర్మానించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రాంబాబు, భావన, రుపేశ్, అశ్రిత, సొసైటీ కార్యదర్శులు నారాయణ రెడ్డి, కిషన్, విండో చైర్మన్‌లు రామకృష్ణ, రాంచందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు ఎకరాల వరకే..

ఆర్మూర్‌రూరల్: ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న రైతు బంధును ఐదు ఎకరాల వరకు ఉన్న రైతులకే వర్తింపజేయాలని ఆలూర్ సొసైటీ సమావేశంలో తీర్మానించారు. శనివారం ఆలూర్ పీఏసీఎస్ కార్యాలయంలో సొసైటీచైర్మన్ తంబురి శ్రీనివాస్ అధ్యక్షతన ప్రత్యేక మహాజన సభ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుబంధును ఐదు ఎకరాల పరిమితి వరకే అందజేయాలని వారు తీర్మానించారు. అదేవిధంగా సాగు భూములకే రైతుబంధు ఇవ్వాలని వారు కోరారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ చేపూర్ రాజేశ్వర్, డైరెక్టర్‌లు కల్లెం బోజారెడ్డి, ఆరే రాజేశ్వర్, ప్రమో ద్‌కుమార్, దార్ల సంతోష్‌రెడ్డి, కట్ట నర్సయ్య, కల్లెం సాయిరెడ్డి, వెల్మనర్సారెడ్డి, మోతె చిన్నారెడ్డి, మాజీసర్పంచ్ కల్లెం మోహన్, సొసైటీ కార్యదర్శి తొర్తి మల్లేష్, డీసీఏవో పాపయ్య, క్లస్టర్ అధికారి సత్యనారాయణరావు, శంకర్‌గౌడ్, ఏవో హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా రుద్రూరు మండల సమావేశం

రుద్రూరు, జూన్ 29 : మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. శనివారం రుద్రూరు మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. అదే విధంగా వివిధ శాఖల అధికారులు గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. అనంతరం మండల విద్యాధికారి శాంతకుమారి పదవీ విరమణ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా, మండలానికి విద్యాధికారిగా ఉండి విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చారని కొనియాడారు. ఎంఈవోతో పాటు మండల చివరి సర్వసభ్య సమావేశం కావడంతో ఎంపీపీ అక్కపల్లి సుజాత నాగేందర్, జడ్పీటీసీ నారోజి గంగారాం, ఎంపీటీసీలను మండల పరిషత్ ద్వారా అధికారులు ఘనంగా సన్మానించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నట్కారి సాయిలు, ఎంపీడీవో సురేష్‌బాబు, ఎంపీవో సాయిలు, మండల కో-ఆప్షన్‌మెంబర్ మస్తాన్, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

రుద్రూరు, జూన్ 29 : రుద్రూరు మండలం అంబం (ఆర్) శివారులో గల ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో మిగిలిపోయిన సీట్లకు జూలై 2న ఉదయం 10.30 గంటల నుంచి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆలూరి నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 9వ తరగతిలో ఆరు, పదోతరగతికి పది, అదే విధంగా కళాశాలలో సీఈసీలో 15, బైపీసీలో 3, ఎంపీసీలో 4 ఖాళీలు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆర్మూర్‌రూరల్ : ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్‌లో వసతిగృహంలో ఖాళీగా ఉన్న రెండు పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని వసతిగృహం వార్డెన్ సునంద శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెడ్‌కుక్ పోస్టు ఖాళీగా ఉందని రూ.7800వేతనం ఉంటుందని, అలాగే వసతిగృహానికి వాచ్ ఉమెన్ పోస్టు ఖాళీగా ఉందని, నెలకు రూ.8710 వేతనం అందజేస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పలు సొసైటీలలో ప్రత్యేక మహాజన సభలు

నవీపేట,జూన్29: మండలంలోని నవీపేట, నాగేపూర్, బినోల సొసైటీలలో శనివారం ప్రత్యేక మహాజన సభలు నిర్వహించారు. రైతుబంధు అమలులో మార్పులు, చేర్పులకు సంబంధించి రైతుల నుంచి పలు సలహాలు, సూచనలు సేకరించారు. కార్యక్రమంలో కో-ఆపరేటీవ్ డిప్యూటీ రిజిస్ట్రార్ శ్రీరాం, సొసైటీ చైర్మన్‌లు అబ్బన్న, శైలేష్ కుమార్, హన్మాండ్లు, వైస్‌చైర్మన్లు ప్రవీణ్‌కుమార్, సత్యంరెడ్డి, ఏవో సురేష్ గౌడ్, సొసైటీ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

బోధన్‌రూరల్,జూన్29: బోధన్ పట్టణంలోని రాకాసిపేట ప్రాంతంలోని గోసంబస్తీకి చెందిన గంధం గంగాధర్(40)అనే వ్యక్తి శనివారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్నాడని బోధన్ పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. అనారోగ్య కారణాల వల్ల ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఇంట్లోనే ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని బోధన్ ఆసుపత్రికి తరలించామన్నారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

కోటగిరి,జూన్29: మండలంలోని ఎక్లాస్‌పూర్ ప్రాథమిక పాఠశాలల్లో శనివారం సాఫ్ట్‌వేర్ ఉద్యోగిణి తనవంతు సాయంగా స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ భాను శిరిషా పాఠశాలల్లోని విద్యార్థులకు బ్యాగులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ మోహన్, ఉపాధ్యాయులు రాజు, యూత్ సభ్యులు కొత్తపల్లి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలోని పూజాసామగ్రి దుకాణం వేలంపాట

బోధన్‌రూరల్, జూన్ 29 : పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలో పూజా సామగ్రి దుకాణం కోసం వేలంపాట నిర్వహిస్తున్నట్లు దేవాలయ ధర్మదాయ శాఖ కార్యనిర్వాహణ అధికారి, జూనియర్ అసిస్టెంట్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తేదిన వేలంపాట నిర్వహించబడుతుందని, రెండు సంవత్సరాల కాల పరిమితి ఉంటుందన్నారు. ఆసక్తి గల వ్యాపారస్థులు 10వేల రూపాయల డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని ఆయన అన్నారు.

శవపేటిక అందజేత

బోధన్‌రూరల్,జూన్29: సాలూర మండలం జాడిజమాల్‌పూర్ గ్రామంలోని చర్చికు శనివారం మాజీ సొసైటీ చైర్మన్ గాలిచిన్నయ్య 70వేల రూపాయల విలువ చేసే శవ పేటికను అందజేశారు. ఈ సందర్భంగా చర్చి నిర్వాహకులు, చిన్నయ్య మాట్లాడుతూ గ్రామానికి శవ పేటిక అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ దాసరి అంతయ్య, గ్రామ పెద్దలు గోగినేని నర్సయ్య, లయన్స్ ప్రతినిధులు తదితరులున్నారు.

రెండు గ్రామాల మధ్య సరిహద్దు చూపాలని వినతి

ముప్కాల్, జూన్29: మండల కేంద్రం, బాల్కొండ మండల మండలం బస్సాపూర్ గ్రామాల సరిహద్దు చూపాలంటు సన్నకారు రైతు సంఘ సభ్యులు శనివారం ఇన్‌చార్జీ తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ముప్కాల్ మండల కేంద్రంలోని జీరోపాయింట్ వద్ద ఇరు గ్రామాలకు బేదాభిప్రాయాలు ఏర్పడి శివారు విషయంలో గొడవలు తలెత్తుతున్నందున రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గ్రామ సరిహద్దు చూపాలని, దర్యాప్తు సమస్యను పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు జి.సాయన్న, దినేష్, గోపు మహేష్, సన్నకారు రైతులు పాల్గొన్నారు.

ముప్కాల్, కిసాన్‌గర్ గ్రామాలకు బాడీఫ్రీజర్ వితరణ

ముప్కాల్, జూన్ 29 : మండలంలోని కిసాన్‌నగర్ గ్రామంలో లయన్స్‌క్లబ్‌తో పాటు ముప్కాల్ గ్రామాభివృద్ధి కమిటీకి బాడీ ఫ్రీజర్‌లను లయన్స్‌క్లబ్ చైర్మన్ జ్ఞానసాగర్‌రెడ్డి వితరణగా అందజేశారు. తన తండ్రి నల్ల నారాయణరెడ్డి జ్ఞాపకార్థంగా బాల్కొండ, ముప్కాల్ మండలాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఫ్రీజర్‌లను అందజేసినట్లు ఆయన తెలిపారు. గల్ఫ్ ప్రాంతంలో ఉన్న వారు తమ ఆప్తులు అంత్యక్రియలకు వచ్చే వరకు స్థానికులు శవపేటిక ఫ్రీజర్‌ను వాడుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చాకులింగం, స్థానిక బాధ్యులు పోతుప్రసాద్, మల్లేష్, నర్సయ్య, ముప్కాల్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



బాడీ ఫ్రీజర్‌ను అందజేస్తున్న లయన్స్ క్లబ్ చైర్మన్ జ్ఞానసాగర్‌రెడ్డి

ఉత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థులకు సన్మానం

పెర్కిట్, జూన్29: జెఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ర్యాంకు సాధించిన క్షత్రీయ జూనియర్ కాలేజీ విద్యార్థినిలు వై.నవ్య, ఎం.పూజితలను కళాశాల యాజమాన్యం శాలువ, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. నవ్య ఎన్ఐటీలో ఆంధ్రప్రదేశ్, పూజిత ఎన్ఐటీ పాట్నాలో సీటు సంపాదించారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, అధ్యాపక బృందం పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

‘ప్రభుత్వం ఆటోడ్రైవర్‌లను ఆదుకోవాలి’

పెర్కిట్, జూన్29 : ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ తరహాలో సంవత్సరానికి రూ.12వేలు ఆటోడ్రైవర్‌లకు ఇవ్వాలని శనివారం ఏఐటీయూసీ నాయకులు ఆరేపల్లి సాయిలు అన్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ పథకం పెట్టడంతో లక్షలాది మంది ఆటోడ్రైవర్‌ల దిక్కు తోచని పరిస్థితిలో ఉన్నారని, వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన రూ.12వేల హామీని అమలు చేసి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనర్సయ్య, శీను, నరేష్, నరేష్, ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

ఆర్మూర్‌రూరల్, జూన్29: మండలంలోని చేపూర్ గ్రామంలో గల ఓ పేద కుటుంబానికి శనివారం గ్రామస్థులు ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన వన్నెల్ ప్రభాకర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయాన్ని స్థానికులు మన చేపూర్ వాట్సాప్ గ్రూప్‌లో ప్రభాకర్ కుటుంబ పరిస్థితిని పోస్టు చేశారు. దీంతో స్థానిక ప్రజాప్రతినిధులు, యువకులతో పాటు విదేశాల్లో ఉంటున్న చేపూర్ వాసులు తలకొంత ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇలా ఫోన్ చేసిన డబ్బులు రూ.73వేలను బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మీనుగు రాజేశ్వర్, ఎస్ఎస్.రెడ్డి, వే ల్పుల రాజు, బాబు, ఆర్మూర్ రవి, రాజు, సతీష్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

తొర్లికొండలో ఘనంగా వెంకటేశ్వరస్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, జూన్ 29: మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి భక్తులు కొండపై చేరుకొని కొండపై చుట్టు భక్తులు కలిసి ప్రదక్షిణ చేయించారు. అనంతరం ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సాయిరెడ్డి, వీడీసీసభ్యులు పాల్గొన్నారు.



చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.280	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	రూ.155	రూ.285	రూ. 305





బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72900	రూ.67,200	రూ.920

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : కల్కి(3డి తెలుగు) (5.50, 9.20, 12.50, 4.20, 7.50, 11.20)
స్క్రీన్-2 : కల్కి(3డి తెలుగు) (6.10, 9.40, 3.30, 7.00, 10.30)
: ఇన్‌సాడ్ ఔట్-2 (ఇంగ్లీష్ 3డి) (1.10)
స్క్రీన్-3 : కల్కి(తెలుగు) (5.40, 9.10, 12.40, 7.10, 10.40)
: మహారాజ (4.10)
స్క్రీన్-4 : కల్కి(తెలుగు) (5.30, 9.00, 12.30)
: ముంజియా (హిందీ) (4.00)
: కల్కి(హిందీ) (6.45, 10.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కల్కి(తెలుగు) (11.20, 2.55, 6.30, 10.05)
స్క్రీన్-2 : కల్కి(తెలుగు) (10.00) (3.10, 6.45)
స్క్రీన్-3 : కల్కి(3డి తెలుగు) (11.50, 3.25, 7.00, 10.35)

దేవి : కల్కి(11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : కల్కి(హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కల్కి (3డి తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్